క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ లకుమళ్ల జ్యోతి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు తప్పకహాజరు కావాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

మునగాల : మండల పరిధిలోని బరాఖత్‌గూడెంలో వృద్ధులు, వికలాంగులకు ఆర్‌జీఏ మార్కెటింగ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఫౌండర్ ఏనుగుల శంకర్‌రావు, నాగేశ్వరరావు, విశాల్‌రెడ్డి, భార్గవ్, నవీన్‌గౌడ్, వికాస్, గుర్వయ్య, సైదులు, శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చిన్న శంకర్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

జగిత్యాల సీఐ సురేష్‌బాబుకు సన్మానం


సీఐ సురేష్‌బాబును సన్మానిస్తున్న మిత్రులు

హుజూర్‌నగర్ : జగిత్యాల సీఐ సురేష్ బాబును హుజూర్‌నగర్‌కు చెందిన ఆయన మిత్రులు బుధవారం పట్టణంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురేష్‌బాబు హుజూర్‌నగర్‌లో చదువుకుని పోలీస్ శాఖలో ఎస్‌ఐగా ఉద్యోగం సాధించి అంచెలంచెలుగా ఎదగడం మిత్రులకు గర్వకారణంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో నాగార్జున, కర్ణకుమార్, సైదులు, సైదిరెడ్డి, నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, బోస్, నరసింహారావు, సందీప్, వెంకన్న, వెంకటేశ్వర్లు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి


కరపత్రం విడుదల చేస్తున్న ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాళ్లు

నేరేడుచర్ల : సూర్యాపేట జిల్లా కేంద్రంలో జూన్ 2, 3 తేదీల్లో జరిగే ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.లక్ష్మి, పావని కోరారు. బుధవారం నేరేడుచర్లలో రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకురాళ్లు రేష్మా, నాగమణి, నర్సమ్మ, ఫాతిమా, ఫర్వీన్, జ్యోతి, నాగజ్యోతి తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆరు గేదెలు మృతి


విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదెలు

మఠంపల్లి : మండలంలోని అవిరేణికుంట తండాలో గల పొలాల్లో ప్రమాదవశాత్తు తెగిపడి ఉన్న విద్యుత్ తీగలకు తగిలి మేతకు వెళ్లిన ఆరు పాడి గేదెలు బుధవారం విద్యుదాఘాతంతో మృతిచెందాయి. ఈ ఘటనకు సంబంధించి స్థానిక మాజీ సర్పంచ్ బానోతు విజయా నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన సర్దార్‌నాయక్, సామ్యా నాయక్‌తో పాటు మరో ఇద్దరికి చెందిన పాడి గేదెలు పొలాల వద్దకు మేతకు వెళ్లి విద్యాదాఘాతంతో మృత్యువాత పడ్డాయన్నారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతోనే గేదెలు చనిపోయాయని ఆరోపించారు. గేదెల విలువ రూ. 3 లక్షలు ఉంటుందని, బాధిత గిరిజనులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలన్నారు.

ఫొటో స్టూడియోలో చోరీ

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని ఓ ఫొటో స్టూడియోలో గుర్తు తెలియని వ్యక్తి బుధవారం చోరీకి పాల్పడ్డాడు. మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామానికి చెందిన పాడిశెట్టి వీరయ్య పట్టణంలోని రెడ్డీకాలనీలో శ్రీ వెంకటేశ్వర డిజిటల్ స్టూడియో నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే మధ్యాహ్నం భోజనానికి వెళ్లగా ఓ వ్యక్తి కస్టమర్‌లా వచ్చి కౌంటర్‌లో ఉన్న 300 మోడల్ కెమరాను తీసుకుని వెళ్లిపోయాడు. వీరయ్య తిరిగి వచ్చి చూస్తే కెమరా కనిపించకపోవడంతో సీసీ పుటేజీలో చూడగా గుర్తు తెలియని వ్యక్తి కెమరా చోరీ చేయడం గుర్తించి వన టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

‘కిస్తీ’ చెల్లింపునకు కష్టకాలం

- మైనర్ గ్రామ పంచాయతీల ఖాతాల్లో నగదు నిల్
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాని నిధులు
- బ్యాంకులకు నేటికీ చెల్లించని గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల కిస్తీలు



చిలుకూరు : మండలంలోని పలు గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల కిస్తీ (ఈఎంఐ)ల చెల్లింపునకు కష్టకాలం వచ్చింది. ఎన్నికల కోడ్ కావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు రావడం నిలిచిపోయాయి. దీంతో పంచాయతీల ఖాతాల్లో చిల్లిగవ్వా లేక ఈ నెలలో నేటికీ కిస్తీలు చెల్లించలేదు. మేజర్ గ్రామ పంచాయతీల్లో పన్నుల ద్వారా వచ్చిన ఆదాయంతో ఎలాగో అలా కిస్తీలు చెల్లిస్తున్నారు. కానీ మైనర్ గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్ కిస్తీల చెల్లింపు భారంగా మారింది.

మూడు నెలలకొకసారి రూ.33 వేలు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వ రెండో సారి అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో ఇంటింటి తిరిగి చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేందుకు గాను ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ ఉండాలని ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రతి గ్రామ పంచాయతీ వారు బ్యాంక్‌ల ద్వారా ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి 33 వేల చొప్పున చెల్లించే విధంగా ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. ఆయా గ్రామ పంచాయతీల ఆదాయాన్ని బట్టి కిస్తీలు పెట్టుకొని ట్రాక్టర్‌ను తీసుకున్నారు. ట్రాక్టర్లు కొనుగోలు చేసి ఇప్పటికీ 17 నెలలు పూర్తయింది. కాగా, మైనర్ గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులు తక్కువగా ఉండడంతో ఈఎంఐలు, ట్రాక్టర్ డీజిల్, ట్రాక్టర్ మరమ్మతులకు డబ్బులు లేక గ్రామ పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కిస్తీలు కట్టని జీపీలు ఇవే..

చిలుకూరు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో మాధవగూడెం, కొమ్ముబండతండా, సీతారాంపురం, సీత్లాతండా, రామ్‌చంద్రానగర్, ఆచార్యులగూడెం, పోలేనిగూడెం మైనర్ గ్రామ పంచాయతీల వారు ఈ నెల ట్రాక్టర్ కిస్తీ (ఈఎంఐ) చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శులకు బ్యాంక్‌ల నుంచి ఫోన్లు వస్తున్నాయి. తాము పర్సనల్ లోన్లు తీసుకున్నట్లు బ్యాంక్‌ల నుంచి తమకు పదేపదే ఫోన్లు వస్తున్నాయని, జీపీ ఖాతాల్లో డబ్బులు లేని ఈపరిస్థితుల్లో ఏం చేయాలని కార్యదర్శులు వాపోతున్నారు. తమ పేరుతో నోటీసులు కూడా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ తీసుకునేటప్పుడే తమ జీపీ నుంచి ఆదాయం లేదని, ఈఎంఐలు చెల్లించలేమని చెప్పినా ఉన్నతాధికారులు ఒత్తిడితో తీసుకోవాల్సి వచ్చిందని అంటున్నారు. ట్రాక్టర్ కిస్తీలు కట్టడం వల్ల గ్రామ పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోతున్నామని చెబుతున్నారు. గ్రామాల్లో పన్నుల రూపంలో వచ్చిన ఆదాయం మొత్తం మూడు నెలలకొకసారి ట్రాక్టర్ కిస్తీలకు, వాటి మెయింటెనెన్స్‌కు సరిపోతున్నాయని అంటున్నారు. గతంలోనూ కిస్తీ (ఈఎంఐ)లు చెల్లించకపోతే బ్యాంక్‌ల అధికారులు ట్రాక్టర్లను తీసుకెళ్లిన సంఘటనలు ఉన్నాయి. ఈ విషయంపై ఉన్నత స్థాయి అధికారులు తక్షణమే స్పందించి జీపీ ఖాతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు జమ చేస్తే ట్రాక్టర్ కిస్తీలు చెల్లిస్తామని కార్యదర్శులు అంటున్నారు.


నేడు డయల్ యువర్ డీఎం

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీ మిర్యాలగూడ డిపో పరిధిలోని ప్రయాణికుల సలహాలు, సూచనల స్వీకరణకు గురువారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం బొల్లెద్దు పాల్ ఒక ప్రకటనలో తెలిపారు.డిపో పరిధిలోని గ్రామాల ప్రజలు సెల్ : 9959226308 నంబరుకు ఫోన్ చేసి తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

సర్టిఫికెట్ల కోసం ముందస్తు దరఖాస్తుల ఆహ్వానం

మిర్యాలగూడ టౌన్ : పాఠశాలలు జూన్ 12వ తేదీ నుంచి పునః ప్రారంభం అవుతున్నందున వివిధ రకాల సర్టిఫికెట్లు కావాల్సిన విద్యార్థులు, నిరుద్యోగులు, ఇతరత్ర ప్రజలు ముందస్తుగా దరఖాస్తులు చేసుకోవాలని మిర్యాలగూడ తహసీల్దారు హరిబాబు కోరారు.బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు పాఠశాలలు ప్రారంభం కాగానే ఒకేసారి కాకుండా ఇప్పటి నుంచే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు సిబ్బందికి సహకరించాలన్నారు.

కామాఖ్య ఆలయంలో ఉత్తమ్ దంపతుల పూజలు


కామాఖ్య ఆలయం వద్ద ఉత్తమ్ దంపతులు

కోదాడ : అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో గల 1500 ఏళ్ల పురాతన కామాఖ్య ఆలయాన్ని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలు బుధవారం సందర్శించారు. ఈ ఆలయాన్ని సందర్శించడం తమకు ప్రత్యేక అనుభూతిని ఇచ్చిందని ఈ సందర్భంగా ఉత్తమ్ దంపతులు అన్నారు.

పోస్టల్ బీమా పథకాలను వినియోగించుకోవాలి


రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

నడిగూడెం : పోస్టల్ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ జిల్లా సూపరింటెండెంట్ వడ్లమూడి వెంకటేశ్వర్లు కోరారు. నడిగూడెం మండలం వల్లాపురం గ్రామానికి చెందిన పల్లా రవీందర్‌రెడ్డి (50) ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు తపాలా శాఖ ద్వారా బజాజ్ ఏఐజీ ప్రమాద బీమా చేయించుకున్నాడు. దీంతో తపాలా శాఖ ద్వారా మృతుడికి ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. దీంతో బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మృతుడి భార్య సునీతకు రూ.10 లక్షల చెక్కు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తపాలా శాఖ ద్వారా 300 రకాల సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ మేనేజర్ రాజేష్‌రెడ్డి, పోస్ట్‌మాస్టర్ షేక్.ఖాజామియా, మాజీ సర్పంచ్ వట్టికూటి చంద్రయ్య, వట్టికూటి వెంకన్న, నూకపంగు ఈదయ్య, రామకోటి, పోస్టల్ సిబ్బంది దున్నా వీరాబాబు, ఎస్‌కె.నజీర్, అహ్మద్ షరీఫ్, గందమల్ల వెంకన్న, కావ్య పాల్గొన్నారు.

ఉత్తమ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోదాడ : ముప్పై సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉండి ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏనాడు చిన్న ఆరోపణ కూడా ఎదుర్కోలేదని నీతి, నిజాయితీకి మారుపేరుగా ఉన్న ఉత్తమ్‌పై బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వరరెడ్డి అవినీతి ఆరోపణలు చేయడం విడ్డూరమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం కోదాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహేశ్వరరెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, ముత్తవరపు పాండురంగారావు, కందుల కోటేశ్వరరావు, చిత్తలూరి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవే ఐవీఓ సంస్థ లక్ష్యం


రూ.2 లక్షలతో మరమ్మతులు చేసిన సింగారం రోడ్డు

కోదాడరూరల్ : సమాజసేవే లక్ష్యంగా ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ (ఐవీఓ) స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యమూర్తి అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగారంరోడ్డు గుంతలమయంగా మారడంతో ఐవీఓ జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత సైనికాధికారి గుండా మధుసూదన్‌చౌదరి రూ.2లక్షల వ్యయంతో రోడ్డుకు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. ప్రభుత్వం రెండేళ్ల క్రితం చేపట్టిన ఈ రోడ్డు పనులు నేటివరకు ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. రోడ్డు గుంతలమయం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. బీటీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆ చౌరస్తాలో ఉన్న గోపయ్యచారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ వింగ్ ప్రెసిడెంట్ పి.సత్యబాబు, జగనీ ప్రసాద్, గుండపునేని నాగేశ్వరరావు, ఎస్‌ఎస్‌రావు, రమేష్, గుండా లక్ష్మి తదితరులు ఉన్నారు.

వైభవంగా జ్వాలా నరసింహస్వామి కల్యాణం


చిలుకూరులో జ్వాలా నరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు


మునగాల : రేపాలలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చిలుకూరు : చిలుకూరు గ్రామ పరిధిలోని శ్రీజ్వాలా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ పూజారి సిరికొండ పృథ్వీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా కురవాలని, పంటలు బాగా పండాలని భక్తులు స్వామివారికి పూజలు చేశారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు

మునగాల : లక్ష్మీనర్సింహస్వామి జయంతిని పురస్కరించుకొని మునగాల మండల పరిధిలోని రేపాలలో గల శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సారిక చిన రామయ్య, భక్తులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో అక్కాతమ్ముళ్ల ప్రతిభ


పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకుంటున్న రేణు సుప్రియ, కార్తికేయ సిద్ధార్థ్

నేరేడుచర్ల: గోవా ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్–2024లో నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని బొడయ్యగూడేనికి చెందిన అక్కాతమ్ముళ్లు కుంకునూరి రేణు సుప్రియ, కుక్కునూరి కార్తికేయ సిద్ధార్థ్ అండర్–12 కటాస్ విభాగంలో బంగారు, వెండి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో ఐదు దేశాలు, 15 రాష్ట్రాల చిన్నారులు పాల్గొన్నారు. పతకాలు సాధించిన చిన్నారులను తల్లిదండ్రులు కుక్కునూరి నాగేశ్వర్‌రావు, శివకుమారితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, బంధువులు అభినందించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

మిర్యాలగూడ టౌన్ : ప్రతి ఒక్కరికీ సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మన సమాచారం–మన హక్కు అనే అంశంపై సమాచార హక్కు సలహా, సహాయ, రక్షణ సమితి గౌరవ అధ్యక్షురాలు రాయపూడి ఆశాలతాజగన్, సామాజిక వేత్త సరికొండ రుషికేశ్వర్‌రాజు ముద్రించిన పుస్తకాలను బుధవారం స్థానిక మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో ఎమ్మెల్యే విద్యార్థులు, నిరుద్యోగులకు పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం నిరుద్యోగుల సౌకర్యార్థం బీఎల్ఆర్ బ్రదర్స్ సహకారంతో 15వ వార్డు కౌన్సిలర్, దాత మంత్రాల రుణాల్‌రెడ్డి గ్రంథాలయానికి బహూకరించిన ఫ్రిడ్జిని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, గార్లపాటి శేఖర్‌రెడ్డి, గ్రంథాలయ నిర్వాహకుడు సుధాకర్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు


చిలుకూరు : ప్రభుత్వం విడుదల చేసిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షా ఫలితాల్లో చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, మెంటర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కందిబండ రామారావు బుధవారం విలేకరులకు తెలిపారు. స్పందన, బి.ఐశ్వర్య, బిందుశ్రీ, పి.ఐశ్వర్య, విజయ్, ఝాన్సీ, ఆదిత్య, అక్షయ్, మాధురి, మహిలు ఎంపికైనట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎన్‌ఎంఎంఎస్‌లో అత్యధికంగా ఒకే పాఠశాల నుంచి 10 విద్యార్థులు ఎంపిక కావడం హర్షించదగిన విషయమని అన్నారు. అనంతరం విద్యార్థులకు ఉత్తమ కోచింగ్ ఇచ్చిన రామారావును ఈ సందర్భంగా అభినందించారు.

పాఠశాలల తనిఖీ


నవభారత్ పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ గిరిబాబు

చిలుకూరు : పాఠశాలలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. బుధవారం చిలుకూరు గ్రామ పరిధిలోని గోబ్లస్ ఇంటర్నేషనల్ పాఠశాల, నవభారత్, సాయి గ్రామర్ పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల అనుమతులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీల్లో కూడా పేదలకు జాతీయ ఉపాధి హామీ పనులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న విధంగానే మున్సిపల్ కేంద్రాల్లో కూడా అమలు చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కొనసాగుతున్నప్పటికీ కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు వైఫల్యం చెందారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, నరసయ్య, బాబు, వెంకన్న, రామయ్య, కోటయ్య, రమణ తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామానికి చెందిన పెయింటర్ పంగ సైదులు మృతి చెందారు. బుధవారం బాధిత కుటుంబానికి ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు నన్నెపంగ శ్రీనివాస్ 25 కిలోల బియ్యం అందజేశారు.

మునగాల జెడ్పీటీసీగా దేశిరెడ్డి జ్యోతి


జ్యోతికి అభినందనలు తెలుపుతున్న సీపీఎం నాయకులు

మునగాల : మునగాల మండల జెడ్పీటీసీ సభ్యురాలిగా దేశిరెడ్డి జ్యోతి స్టాలిన్‌రెడ్డి బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేశారు. 2019 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నలపాటి ప్రమీల తప్పుడు పత్రాలను సమర్పించి గెలిచారని, ఆమె గెలుపు చెల్లదంటూ దేశిరెడ్డి జ్యోతి స్టాలిన్‌రెడ్డి 2019లో హుజూర్‌నగర్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు 2024 ఫిబ్రవరి 5న ప్రమీల గెలుపు చెల్లదని తీర్పు వెలువరించింది. దీంతో ప్రమీల మరోసారి హైకోర్టును ఆశ్రయించగా కోర్టు విచారణ జరిపి సీపీఎం అభ్యర్థి జ్యోతిని జెడ్పీటీసీ సభ్యురాలిగా ప్రకటిస్తూ తీర్పునిచ్చింది. కాగా, జెడ్పీటీసీగా నియమితులైన జ్యోతికి సీపీఎం నాయకులు బుర్రి శ్రీరాములు, మండల కార్యదర్శి చందా చంద్రయ్య, జూలకంటి విజయలక్ష్మి, దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకటరెడ్డి, సురేష్, రామిరెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి ఓటు వేయాలి

గరిడేపల్లి : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి ఓటు వేసి ఆశీర్వదించాలని ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా శ్రీలతారెడ్డి కోరారు. బుధవారం గరిడేపల్లి మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని అన్నారు. కాంగ్రెస్ కంటే బీజేపీకే ఓటు వేయాలన్న ఆలోచన ప్రజల్లో పార్లమెంట్ ఎన్నికల్లో కనిపించిందన్నారు. పట్టభద్రులు ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు సాధించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. అధికార పార్టీని ఆదరిస్తే సమస్యలపై పోరాడే వారు ఎవరూ ఉండరన్నారు. ఈ కార్యక్రమంలో పోకల వెంకటేశ్వర్లు, వరుణ్‌రెడ్డి, కేసరి శోభ, మేకల వెంకటేశ్వర్లు, జనిగల శ్రీనివాస్, చిత్తలూరు సోమయ్య, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలి


హుజూర్‌నగర్ : విశ్రాంత ఉద్యోగులను ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్


మోతె : కూడలిలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు


హుజూర్‌నగర్‌రూరల్ : పట్టభద్రులకు గుర్తు చూపిస్తున్న పీసీసీ ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రావు

హుజూర్‌నగర్ : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ఇవ్వాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చక్కర వీరారెడ్డిలు విశ్రాంత ఉద్యోగులను కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఒక్క పట్టభద్రుడు తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అబ్బర్వార్ జగదీశ్వర్‌రావు, పర్వతపు వెంకటేశ్వర్లు, చిన్న సోమయ్య, దేవదానం, లక్ష్మయ్య, అంకతి అప్పయ్య, ఎంఎస్‌ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ప్రచారం

మోతె : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి కోరారు. బుధవారం మోతె మండల పరిధిలోని కూడలి, ఉర్లుగొండ, అన్నారిగూడెం, బుర్కచర్ల, అప్పన్నగూడెం, రావిపహాడ్ గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు తీన్మార్ మల్లన్నకు ఓటు వేసి గెలిపించి, మతతత్వ బీజేపీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డలో..

హుజూర్‌నగర్‌రూరల్ : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పీసీసీ ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రావు కోరారు. బుధవారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డలో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, విజయ్‌కుమార్, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



బాధితురాలికి పర్సు, నగదు అందజేస్తున్న పోలీసులు

నడిగూడెం: ఆటోలో ప్రయాణికురాలు మర్చిపోయిన పర్సును పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు ఆటో డ్రైవర్. ఎస్ఐ జి. అజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం దొరకుంట గ్రామానికి చెందిన ఎన్నబోయిన సరోజ బుధవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మంగళితండాకు చెందిన బానోతు సురేష్ ఆటోలో నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురంలోని తన బంధువుల ఇంటికి వెళ్లింది. కాగితరాచంద్రాపురంలో ఆటో దిగిన సరోజ ఆటోలో తన పర్సు మర్చిపోయింది. ఇది గమనించిన ఆటో డ్రైవర్ పర్సుతో పాటు అందులో ఉన్న రూ.11,200 నగదును నడిగూడెంలో పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. పర్సులో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా సరోజకు పోలీసులు సమాచారం ఇచ్చి పోలీస్ స్టేషన్‌కి పిలిపించి పర్సుతో పాటు నగదు అందజేశారు. ఆటో డ్రైవర్ సురేష్‌ను పోలీసులు అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జగన్, కొండా వెంకన్న, భోనగిరి ఉపేందర్ ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ బీసీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సచివాలయంలోని ఆర్థికశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తేనే ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇస్తామంటూ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయని వివరించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని బకాయిలను విడుదల చేసి ఆదుకోవాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు రవి కిరణ్ తదితరులున్నారు.